

పాము కాటుకు రైతు మృతి
స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు
నిబంధనలు పాటించాలి
కాలుష్య జలాలకు
బలైన మరో నాలుగు గేదెలు
7లో



గత సంవత్సరం ఆగస్టులో అలుగు పారుతున్న నల్లవాగు ప్రాజెక్టు

నాడు కళకళ..
నేడు వెలవెల..

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు వర్షాభావంతో వెలవెలబోతున్నది. ఆగస్టు వచ్చినా ప్రాజెక్టులోకి వరద రాలేదు. ఈ మధ్య తరహా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1,493 అడుగులు. కాగా, ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 1,483 అడుగులుగా ఉంది. ఈ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల పరిధిలో 5,100 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికీ ఒక్క ఎకరాలో కూడా వరి నాట్లు వేయలేదు. పదేళ్లలో ప్రాజెక్టు ఇంతలా ఎప్పుడూ ఖాళాగా లేదని రైతులు వాపోతున్నారు.


-కల్హేర్



ప్రస్తుతం నీరు లేక బోసిపోయిన నల్లవాగు ప్రాజెక్టు

పెద్దచెరువు ఆక్రమణదారుల్లో
‘హైడ్రా’ టెన్షన్

- ఇప్పటికే రెండుసార్లు సందర్శించిన కమిషనర్
- అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై న్యాయపరమైన చిక్కులు రాకుండా అధ్యయనం
- చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే 10 కాలనీలు
- పదుల సంఖ్యలో హెచ్ఎండీఏ లేఅవుట్లు
- వందల సంఖ్యలో నిర్మాణాలు
- గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాలతో గతంలో సర్వే
- నోటీసులతోనే సరిపెట్టిన మున్సిపల్ అధికారులు
- ‘హైడ్రా’ రాకతో కలకలం



‘జీవవైవిధ్యపరంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న అమీన్‌పూర్ చెరువును చూస్తే బాధేస్తోంది. వ్యర్థాలతో నింపి చెరువును రెండుగా విభజించారు’...
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

పటాన్‌చెరు, ఆగస్టు 22: నగర శివారులోని అమీన్‌పూర్ పెద్ద చెరువు ఆక్రమణదారుల్లో ‘హైడ్రా’ భయం పట్టుకున్నది. ‘హైడ్రా’ కమిషనర్ రంగనాథ్ ఇప్పటికే రెండుసార్లు పెద్దచెరువును పరిశీలించడంతో కలకలం మొదలైంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న ‘హైడ్రా’ పెద్దచెరువు విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నది. ఇక్కడ ఏకంగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే లేఅవుట్ల ఏర్పాటుకు హెచ్ఎండీఏ అనుమతులు ఇవ్వడం, ఆయా లేఅవుట్లలో మున్సిపల్ అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో పెద్దసంఖ్యలో భవనాలు వెలిశాయి. ఈ నిర్మాణాలను కూల్చితే న్యాయపరమైన చిక్కులు వస్తాయేమోనని ఆలోచిస్తున్నట్టు తెలుస్తున్నది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 10 కాలనీలకు చెందిన వందలాది నిర్మాణాలు ఉండడం గమనార్హం. ఇప్పటికే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతి ఉన్న లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన 5వేల మంది జేఏసీగా ఏర్పడి ఆందోళనలు ప్రారంభించారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్లను కలిశారు. ఈ నేపథ్యంలో ‘హైడ్రా’ ఎలా ముందడుగు వేస్తుందనే ఉత్కంఠ నెలకొన్నది. మరోవైపు ఔటర్‌రింగ్ రోడ్డు చుట్టుపక్కల చాలాచోట్ల కూల్చివేతలు కొనసాగుతున్నా.. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఒక్కచోట ‘హైడ్రా’ కూల్చివేతలు ప్రారంభం కాలేదు.

300 ఎకరాల నుంచి 93 ఎకరాలకు..

జీవవైవిధ్య జలాశయంగా ప్రభుత్వం గుర్తించిన అమీన్‌పూర్ పెద్దచెరువు క్రమంగా ఉనికి కోల్పోతోంది. 500 ఏళ్ల క్రితం 300 ఎకరాల్లో ఈ చెరువును తవ్వించినట్టు తెలుస్తున్నది. ఇక్కడికి ప్రతీ సంవత్సరం విదేశీ పక్షులు వలస వస్తుంటాయి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ 2016లో జీవవైవిధ్య జలాశయంగా గుర్తింపు ఇచ్చింది. కానీ, ఈ చెరువు చుట్టూ పెద్దఎత్తున అపార్ట్‌మెంట్లు, కాలనీలు విస్తరిస్తున్నాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ భవనాలు వెలిశాయి. చెరువు విస్తీర్ణం ప్రస్తుతం 93 ఎకరాలకు పరిమితమైంది. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించాలని హరితట్రిబ్యూనల్ ఆదేశాలు జారీచేయడంతో హెచ్ఎండీఏ, నీటిపారుదలశాఖ, రెవెన్యూ విభాగాలు సంయుక్తంగా సర్వేకు పూనుకున్నాయి. ఓ ప్రైవేటు కన్సల్టెన్సీకి సర్వే పనులు అప్పగించాయి. సదరు సంస్థ గుర్తించిన హద్దుల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధిలో 500కు పైగా కట్టడాలు ఉన్నాయని తేలింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో కదిలిన మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇంత జరిగినా ఇప్పటికీ ఎఫ్‌టీఎల్ పరిధిలో స్థానిక మున్సిపాలిటీ నుంచి దొడ్డిదారిన అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.



పెద్ద చెరువు కాలువ దుస్థితి



నర్సాపూర్‌అర్బన్ పార్కులో చేపట్టిన పనులను అమెరికా బృందానికి వివరిస్తున్న అటవీశాఖ అధికారులు

ఫారెస్ట్ ఫ్లస్ 2.0 సక్సెస్

- అడవుల అభివృద్ధి.. ఉపాధి కల్పన లక్ష్యం
- పైలెట్ ప్రాజెక్టు కింద మెదక్ జిల్లా ఎంపిక
- పరిశీలనకు అమెరికా నుంచి ప్రత్యేక బృందం
- ఫారెస్ట్ ఫ్లస్ 3.0ను దేశ వ్యాప్తంగా అమలు చేస్తాం: ప్రత్యేక బృందం

మెదక్ అర్బన్, ఆర్బన్, ఆగస్టు 22: సాంకేతిక పరిజ్ఞానంతో అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం, పర్యావరణాన్ని పెంపొందించడంతోపాటు గ్రామీణ ప్రజలకు ఆదాయ వనరులు కల్పించడమే లక్ష్యంగా యూనైటెడ్ స్టేట్ ఏజెన్సీ ఫర్ ఇంటర్‌నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్‌ఏఐడీ), కేంద్ర అటవీ పర్యావరణ శాఖ సంయుక్తంగా 2019లో ఫారెస్ట్ ఫ్లస్ 2.0 పేరిట చేపట్టిన ప్రాజెక్ట్ సక్సెస్ అయ్యింది. పైలెట్ ప్రాజెక్టు కింద దేశంలో బీహార్, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్ట్ చేపట్టగా, రాష్ట్రంలో మెదక్ జిల్లా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా జిల్లా పోచారంలో 56 వేల హెక్టార్ల అటవీ ప్రాంతంలో వాటర్‌షెడ్లు, ల్యాండ్ స్కేప్స్, ఏకో టూరిజం స్పాట్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఫారెస్ట్ బీట్‌లో 200 హెక్టార్ల అటవీ భూమిని అభివృద్ధి చేశారు. నూతన విధానంలో మొక్కలు నాటి సంరక్షించి అడవిని పునరుద్ధరించారు. మొదటగా జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, కౌడిపల్లి రేంజ్‌లో మొక్కలు నాటి సంరక్షించారు. ఇందు కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. కొత్తగా నాటిన మొక్కలకు జీపీఆర్ఎస్ అనుసంధానం చేశారు. జంతుజాలం వివరాలనూ యాప్‌లో నమోదు చేశారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించేందుకు మునగ, సీతాఫలం, విస్తరాకులకు సంబంధించి మూడు యూనిట్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు గతేడాది డిసెంబర్‌లో పూర్తయ్యింది.

అమెరికా నుంచి ప్రత్యేక బృదం రాక..

జిల్లాలో విజయవంతమైన ఫారెస్ట్ ఫ్లస్ 2.0 కార్యక్రమాన్ని గురువారం అమెరికా నుంచి వచ్చిన ప్రత్యేక బృందం పరిశీలించింది. మిస్టర్ పాల్ గ్రోవ్ క్లర్క్ సెనేట్ అప్రాప్రియేషన్స్ కమిటీ మెదక్, పోచారం, నర్సాపూర్ అడవులతోపాటు అర్బన్ పార్కును పరిశీలించింది. అటవీశాఖ సీసీఎఫ్ శర్వానంద్, డీఎఫ్‌వో జోజీ, ఎఫ్ఆర్‌వో అరవింద్ వారికి అటవీ పరిరక్షణ, ఈకో టూరిజం, అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ప్రజలకు పచ్చదనంపై అవగాహన వచ్చేలా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం పట్ల ప్రతినిధుల బృందం అభినందించారు. జిల్లాలో చేపట్టిన ప్రాజెక్ట్ విజయవంతం అయిందని, రానున్న రోజుల్లో ఫారెస్ట్ ఫ్లస్ 3.0 కింద దేశవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. అనంతరం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ పర్యటనలో మిస్టర్ పాల్ రాడెమాకర్, మార్క్, వర్గీస్, చీఫ్ కన్జర్వేటర్ శర్వణన్, ఫారెస్ట్ ఫ్లస్ బృందంలోని సభ్యులు డా. ఉజ్వల్ ప్రధాన్, అశిష్‌రాజ్, గైని సాయిలు తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్ అర్బన్ పార్కు వ్యూ పాయింట్ నుంచి అడవిని పరిశీలిస్తున్న అమెరికా బృందం

డిజిటల్ భోధనతో
మెరుగైన ఫలితాలు

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి



కేజీబీవీలో డిజిటల్ భోధనను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

కంది, ఆగస్టు 22 : డిజిటల్ పద్ధతిలో భోధన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. మండల పరిధిలోని కాశీపూర్ వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, కిచెన్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్, డిజిటల్ క్లాసులను తనిఖీ చేశారు. పాఠ్యాంశాల్లోని ప్రశ్నలను అడిగి విద్యార్థుల అభ్యసనను పరీక్షించారు. బోధనోపకరణాలు ఉపయోగించి పాఠ్యాంశాలు బోధిస్తేనే విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుంటారని ఉపాధ్యాయులకు సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి మీరాబాయి, సిబ్బందిని ఆదేశించారు.

ఫేక్ మెసేజ్‌ను నమ్మొద్దు : సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 22 : రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలకు పోలీసులు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ స్పందించారు. ఈమేరకు గురువారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మెసేజ్‌లో పేర్కొన్న నంబర్లు తెలంగాణ పోలీసులవి కావని, ప్రజలు ఇటువంటి మెసేజ్‌లను నమ్మవద్దని కోరారు.

సంగారెడ్డిలో 24న ఫ్రీడం వాక్

‘చేయి చేయి కలుపుదాం.. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం’.. అనే నినాదంతో ఈ నెల 24న ఉదయం సంగారెడ్డి పట్టణంలో ఫ్రీడంవాక్ నిర్వహించనున్నట్టు ఎస్పీ రూపేష్ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిపాలన విభాగం, పోలీసుశాఖ, సహేరా ఆసుపత్రి ఆధ్వర్యంలో వాక్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.



సీఎంకు రైతుల
ఉసురు తగులుతది
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు
- రుణమాఫీపై మండలాల్లో ఆందోళనలు
8లో

గురుకుల పాఠశాలలో
కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీలు

హవేళీఘణపూర్, ఆగస్టు 22: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల, బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని కిచెన్, వాష్ రూమ్‌లు, తరగతి, భోజన గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



సీతక్క మంచి మనస్సు..

తన వద్ద పని చేసే ఓ వ్యక్తి ఇంట్లో వివాహం సందర్భంగా మంత్రి సీతక్క గురువారం అతని ఇంటికి వచ్చారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కిష్టాయ్యపల్లికి చెందిన కుమ్మరి శ్రీకాంత్.. మంత్రి సీతక్క హైదరాబాద్ కార్యాలయంలో పని చేస్తారు. ఆయన సోదరి వివాహం రెండు రోజుల్లో జరగనుండగా, సీతక్క వచ్చి వధువును ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. మంత్రి రాక సందర్భంగా బొల్లారం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తన కార్యాలయంలో పని చేసే వ్యక్తి ఇంట్లో జరిగే శుభకారానికి మంత్రి హాజరు కావడంతో ఆమె ఎంత మంచి మనిషో అని స్థానికులు అభినందిస్తున్నారు.

-జిన్నారం



ఇటీవల కురిసిన వర్షాలకు కందకాన్ని తలపిస్తున్న మర్వెల్లి-బిజిలీపూర్ రోడ్డు

దారిద్ర్యం

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గుంతల్లో వాహనం నడిపితే నడుము విరుగుతున్నది. అందోల్ నియోజకవర్గంలో రోడ్లు అమ్మో.. అనిపిస్తున్నాయి. నర్సాపూర్-పటాన్‌చెరు రోడ్డు నరకానికి నకలుగా మారింది. మనోహరాబాద్ మండలం కూచారం దారికి గ్రహణం వీడడం లేదు. నారాయణఖేడ్‌ను పట్టించుకునే నాథుడే లేడు!

7లో

సన్మానం.. వెల్దుర్తి, ఆగస్టు 22: ఇటీవల వెల్దుర్తి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ తదితరులు ఘనంగా సన్మానించారు.

ప్రతి ఒక్కరూ సేవా బావాన్ని కలిగిఉండాలి

మిరుదొడ్డి, ఆగస్టు 22 : ప్రతిఒక్కరూ సేవాభావాన్ని కలిగిఉండాలని నైపుణ్య ఆర్గనైజేషన్ ఎక్స్‌కూటివ్ డైరెక్టర్ తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మిరుదొడ్డిలో నైపుణ్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్రీర్తిశేషులు ఏజీ సురేందర్‌రెడ్డి కుటుంబసభ్యుల సౌజన్యంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆర్గనైజేషన్ సభ్యులు ఐలయ్య, రమేష్, బీఆర్ఎస్ నాయకులు మల్లయ్య, స్వామి, రాజు తదితరులున్నారు.



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసిన సంస్థ సభ్యులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా

తూప్రాన్, ఆగస్టు 22: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ గురువారం ఆందోళన చేపట్టింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీగా తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వరకు వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలోని అధికారికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కార్తీక్, జిల్లా నాయకులు జగన్, ప్రవీన్, ఆంజి, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా ప్రభుదాన్యం

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 22 : ప్రభుత్వ న్యాయవాదిగా సంగారెడ్డి పట్టణానికి చెందిన ప్రభుదాన్యం నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్రను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుదాన్యం మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన కేసుల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ప్రభుత్వం ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని చెప్పారు.



జిల్లా ప్రధాన న్యాయాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుదాన్యం

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి


మండేపల్లి రాజు(ఫైల్)

సిద్దిపేట రూరల్, ఆగస్టు 22 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైర్ కింద పడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మండేపల్లి రాజు(46) వృత్తి రీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌పై వెళ్లాడు. పొలం వద్ద ట్రాక్టర్ పక్కన నిలబడి స్టార్ట్ చేయగా గేర్‌లో ఉండడంతో ముందుకు వెళ్లగా దాని వెనుక పెద్ద టైర్ కింద పడి రాజు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. ప్రమాదం జరిగిన స్థలాన్ని సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ గూడ అపూర్వరెడ్డి పరిశీలించి జరిగిన తీరును తెలుసుకున్నారు. రాజు కుమారుడు మండేపల్లి భగవాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

మిరుదొడ్డి, ఆగస్టు 22 : ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందిన సంఘటన గురువారం మండలంలోని మల్లుపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. మిరుదొడ్డి ఎస్‌ఐ పర్షరాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బంజర్ల నవీన్(27) చౌదరిచెరువుకట్టపై మద్యం తాగాడు. ఈ క్రమంలో మూత్రవిసర్జనకు కట్ట కిందకు దిగగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న పోలీసులు చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ముగ్గురు కుటుంబసభ్యులకు గాయాలు


ఐలవ్వ మృతదేహం

చేర్యాల, ఆగస్టు 22 : తెగిపోయిన సర్వీస్ వైర్‌ను సరిచేసుకోకపోవడంతో చిన్నపాటి నిర్లక్ష్యంతో విద్యుత్‌షాక్‌కు గురై కళ్లముందే కన్నతల్లి ప్రాణం కోల్పోగా, ముగ్గురు కుటుంబసభ్యులు గాయాలపాలైన సంఘటన గురువారం చేర్యాల మండలంలో చోటుచేసుకున్నది. ముస్త్యాల గ్రామానికి చెందిన బైర ఐలవ్వ(59) ఇంటి ఆవరణలోని విద్యుత్ మీటర్ సర్వీస్ వైర్‌ను రేకులకప్పు మీదుగా ఏర్పాటు చేశారు. ఇటీవల విద్యుత్ సర్వీస్ వైర్ తెగడంతో దానికి వస్త్రాన్ని చుట్టారు. అయితే గాలులకు వైర్ తెగి రేకుల కప్పుకు తాకిన విషయాన్ని గమనించ లేదు. గురువారం తమ వ్యవసాయబావి వద్ద దుస్తులు ఉతికి ఇంటికి తీసుకువచ్చిన అనంతరం ఐలవ్వ అల్యూమినీయం తీగపై ఆరబెట్టుతుండగా షాక్‌కు గురై మృతిచెందింది. ఆమెను కాపాడబోయిన కుమారుడు అనిల్, కోడలు రమ్య, కూతురు శ్యామల షాక్‌కు గురై అరిచారు. గమనించిన చుట్టుపక్కలవారు వైరును తొలగించడంతో ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. అందరినీ చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఐలవ్వ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

పాము కాటుతో రైతు మృతి

కంగ్టి, ఆగస్టు 22 : పాము కాటుకు గురై రైతు మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని జంగి.కె గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోటగిరి సంతోష్ తన భార్య కవితతో కలిసి కుటుంబ పోషణ నిమిత్తం కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వ్యవసాయ పనుల కోసం పదిహేను రోజుల క్రితమే వారు గ్రామానికి వచ్చారు. తన వ్యవసాయ భూమిలో బోరు వేసి పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేశాడు. బుధవారం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన సంతోష్ రాత్రి పొలం వద్ద ఉన్న గుడిసేలోనే నిద్రించాడు. దీంతో పాము కాటు వేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భర్త ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం భార్య పొలానికి వెళ్లి చూడగా సంతోష్ మృతిచెంది కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

పాపన్నపేట, ఆగస్టు 21 : మనస్తాపంతో ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. టేక్మాల్ మండలం బోడగట్టుకు చెందిన మల్లేశం భార్య తొమ్మిది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి కూతురు కందిపల్లి చందు(14) తల్లి గురించి బాధపడుతుండేది. మనస్తాపం చెందిన చందు బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. గురువారం కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలపారు.

కాలుష్య జలాలకు బలైన మరో నాలుగు గేదెలు

జిన్నారం మండలంలో తొమ్మిదికి చేరిన గేదెల మృతి


గేదెల మృతదేహాలు

జిన్నారం, ఆగస్టు 22 : గడ్డపోతారం పంచాయతీ కిష్టాయ్యపల్లిలో కాలుష్య జలాలు తాగి మరో నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. కిష్టాయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు సాయికుమార్‌కు చెందిన ఐదు పాడి గేదెలు రెండు రోజులుగా మరణించగా.. గురువారం ఉదయం మరో నాలుగు మృత్యువాత పడ్డాయి. ఇటీవల గ్రామ శివారులో పరిశ్రమల నుంచి వదిలని రసాయన జలాలు తాగిన ఘటనలో బాధిత రైతుకు చెందిన తొమ్మిది పాడి గేదెలు మృతిచెందాయి. పరిశ్రమల కాలుష్యం తీరుపై బాధిత కుటుంబం, స్థానిక నాయకులు పీసీబీ కేంద్ర కార్యాలయం వద్ద ఆందోళన కూడా నిర్వహించారు. కాగా ఘటన స్థలాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ, పీసీబీ అధికారులు సందర్శించి, దర్యాప్తు చేపట్టారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు.

నకిలీ మద్యం పట్టివేత

జహీరాబాద్, ఆగస్టు 22 : అక్రమంగా తరలిస్తున్న 44 బాటిళ్ల డిఫెన్స్ నకిలీ మద్యాన్ని గురువారం రాత్రి మండలంలోని కొత్తూరు(బి) గ్రామం వద్ద ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్‌కు డిఫెన్స్ మద్యాన్ని తక్కువ ధరకు సరఫరా చేస్తానని అభిషేక్‌పండ్రే కొందరితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. గురువారం బీదర్ నుంచి నగరానికి కారులో తరలిస్తున్న క్రమంలో నమ్మదగ్గ సమాచారం మేరకు మండలంలోని కొత్తూర్(బి) వద్ద మాటువేసి నిందితుడిని పట్టుకున్నారు. కారును, 44 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కారు, మద్యం విలువ సుమారు రూ.7.30 లక్షల వరకు ఉంటుందని సీఐ తెలిపారు.

ముందస్తు నోటీసు ఇవ్వకుండా సస్పెన్షన్ సరికాదు

- ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి
- డీఈవోకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక వినతి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 : జిల్లాలో చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక అభిప్రాయపడింది. గురువారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డీఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మదన్‌గోపాల్, సాబేర్‌అలీలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఏదైనా పొరపాటు చేసినపుడు మెమో ఇచ్చి వివరణ తీసుకోవాలని, సంతృప్తి చెందకపోతే అప్పుడు సస్పెండ్ చేయాలే తప్ప ముందుస్తు నోటీసు లేకుండా చర్యలు తీసుకోవడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. ఇటీవలి కాలంలో విధుల నుంచి తొలగించిన ఉపాధ్యాయులను వెంటనే విధులకు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్, ప్రభాకర్, అడివప్ప, బాలయ్య, దుర్గయ్య సాయిలు, శ్రీనివాస్, కంమ్రోదిన్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

మాసాయిపేట, ఆగస్టు 22 : మాసాయిపేట మండలం పోతనశెట్టిపల్లి శివారులోని ఏర్పాటు చేయనున్న హెపా లైఫ్ డ్రగ్ పరిశ్రమపై పీసీబీ, రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అధికారులు గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అభిప్రాయ సేకరణ నిర్వహించారు. అయితే పరిసర గ్రామాల్లో అధికారులు చాటింపు చేయకుండానే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడంపై ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు అతికొద్ది సమయంలోనే ప్రజాభిప్రాయ సేకరణ జరపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు, సంబంధిత అధికారులను కోరారు.


టేక్మాల్-ధనూర రోడ్డు


సంగుపేట రోడ్డు దుస్థితి


పొలాన్ని తలపిస్తున్న అక్కానిపల్లి రోడు


బురదమయంగా పాంపాడ్ రోడ్డు

దారిద్ర్యం

అధ్వానంగా అందోలు నియోజకవర్గ రహదారులు
గుంతలమయంగా నర్సాపూర్ - పటాన్‌చెరు రోడ్డు
మనోహరాబాద్ మండలంలోని కూచారం దారికి గ్రహచారం


గుంతలు, బురదమయంగా పోచారం దారి


ధ్వంసమైన మర్పల్లి-బిజిలీపూర్ రోడ్డు


మేడికుంట శివారులో చెరువును తలపిస్తు..


కంకర వేసి వదిలేసిన బుస్సారెడ్డిపల్లి రోడ్డు

అడుగుకో గుంత

జోగిపేట, ఆగస్టు 22 : అడుగుకో గుంత.. అతుకుల బొంత అన్న చందంగా మారింది ఆందోలు నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితి. వర్షాలకు మెజారిటీ రహదారులన్నీ ధ్వంసమయ్యాయి. కంకర తేలి, రోడ్లపైకి మట్టి చేరడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కిలోమీటర్ల మేర బురదమయంగా మారడంతో ప్రయాణికులు నరక యాతన అనుభవిస్తున్నారు. ప్రధాన రహదారుల్లోని పెద్ద పెద్ద గుంతల్లో వర్షపునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఇది గుర్తించని వాహనదారులు అందులో పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. సాక్షాత్తు మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే రోడ్ల దుస్థితి ఇంత అధ్వానంగా తయారైనా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కంకర తేలిన ఎల్లుపేట-టేక్మాల్ రోడ్డు


రాయికోడ్-కప్పాడ్ రోడ్డు


గుంతలమయమైన పోచారం-రాయిపల్లి రోడ్డు, కంకరతేలిన మునిపల్లి-సింగూరు రోడ్డు

ప్రమాదకరంగా దారి.. ఆర్టీసీ బస్సు రాకపోకలు బంద్

నర్సాపూర్, ఆగస్టు 22 : నర్సాపూర్ నుంచి పటాన్‌చెరుకు వయా కాగజ్‌మద్దూరు, నత్నాయపల్లి మీదుగా వెళ్లే దారి మెదక్, సంగారెడ్డి రెండు జిల్లాలకు లింకు రోడ్డు. ఈ దారి గుండా పారిశ్రామిక ప్రాంతంతో పాటు హైదరాబాద్ శివారు ప్రాంతాల వారు ఎక్కువగా రాకపోకలు సాగిస్తారు. ఈ ప్రధాన రహదారి పెద్ద పెద్ద గుంతలతో బీటీ అంతా లేచి కంకర తేలి దారుణంగా తయారైంది. ఈ రోడ్డు దుస్థితి బాగ లేక ఆర్టీసీ బస్సులు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయని, గుంతల వల్ల ఎక్కడ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బస్సులను నిలిపివేశామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారంటేనే ఈ రోడ్డుపై ప్రయాణం ఎంతో ప్రమాదకరమో అర్థమవుతుంది. గతంలోనే ఈ దారిని రెండు లేన్లుగా విస్తరించేందుకు ప్రతిపాదించారు. రూ.2.67 కోట్లను కేటాయించినప్పటికీ పనులు మాత్రం ప్రారంభించలేదు. కనీసం ఉన్న సింగల్ లేన్ రోడ్డు మరమ్మతులకు నోచుకోవడం లేదు.


నర్సాపూర్ - పటాన్‌చెరు రోడ్డు

సొంత ఖర్చుతో కూచారం రోడ్డుకు మరమ్మతులు


ఎక్స్‌కవేటర్‌తో బురద రోడ్డును సరిచేయించుకుంటున్న గ్రామస్థులు

మనోహరాబాద్, ఆగస్టు 22 : మండలంలోని జాతీయరహదారి 44 నుంచి కూచారం గ్రామానికి వెళ్లే 4 కిలోమీటర్ల రోడ్డు బురదమయంగా మారింది. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తాజాగా కురిసిన వర్షాలకు రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. బురదపేరుకుపోయి అడుగు తీసి అడుగు వేయలేకుండా ఉన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. చేసేదేమీ లేక గ్రామస్థులే రోడ్డు బాగు కోసం నడుంబిగించారు. సొంత ఖర్చులతో బుధవారం ఈ దారికి మరమ్మతులు చేపట్టారు. గతంలోనే రోడ్డు వేసేందుకు ప్రభుత్వం రూ.1.08 కోట్లను మంజూరు చేసింది. కానీ ఇప్పటివరకు నెరవేరలేదు.

చెరకు రైతుల అభివృద్ధికి కృషి

- ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- సీడీసీ చైర్మన్‌గా షాదుల్ ప్రమాణం

కల్హేర్, ఆగస్టు 22 : రాష్ట్ర ప్రభుత్వం చెరకు రైతుల అభివృద్ధికి కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని మాగి జీఎస్‌ఆర్ షుగర్స్ చెరకు అభివృద్ధి మండలి(సీడీసీ) నూతన చైర్మన్‌గా నియోజకవర్గానికి చెందిన ఎండీ షాదుల్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్‌ఆర్ షుగర్స్ పరిధిలోని నారాయణఖేడ్, కామారెడ్డి జిల్లా జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో ఖేడ్ పరిధిలోనే అత్యధికంగా చెరకు సాగు అవుతుందని అన్నారు. చెరకు రైతులు అధిక దిగుబడి సాధించడానికి ఫ్యాక్టరీ యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఇక్కడ రైతులకు తోడ్పాటు అందించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎకరాకు 50 నుంచి 60 టన్నుల దిగుబడి వస్తుందని మన దగ్గర నూతన పద్ధతులు పాటించి దిగుబడి సాంధించేందుకు కృషి చేయాలన్నారు. ఎండీ షాదుల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యేలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన షాదుల్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి, రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, జీఎస్‌ఆర్ షుగర్స్ వైస్ చైర్మన్ వేణుగోపాలరావ్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పంచాయతీల నిర్వహణ కష్టంగా మారింది

ప్రభుత్వం వెంటనే నిధులను మంజూరు చేయాలి : కార్యదర్శులు


సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు

మిరుదొడ్డి, ఆగస్టు 22 : గ్రామ పంచాయతీ నిర్వహణకు ప్రభుత్వం వెంటనే నిధులను మంజూరు చేయాలని మిరుదొడ్డి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ఫహీం కోరారు. గురువారం మిరుదొడ్డిలోని 20 గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీల నిర్వహణకు రావాల్సిన నిధులకు మంజూరు చేయకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పు తెచ్చి నిర్వహణ చేస్తున్నామని తెలిపారు. దీంతో తమ కుటుంబపోషణ కష్టంగా మారే అవకాశం ఉందన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో గణేష్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.

స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు నిబంధనలు పాటించాలి

27న ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ మేళా : అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 : స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ సూచించారు. సంగారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయంలో నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఏఎస్‌వీఐ)ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ శాఖ సౌజన్యంతో నెస్లే వారి సహకారంతో స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు శిక్షణ కార్యక్రమం గురువారం కొనసాగింది. వీధి ఆహార వ్యాపారులు వినియోగదారుడితో మెలగాల్సిన తీరుతో పాటు ఫుడ్ సేఫ్టీలో పాటించాల్సిన నిబంధనలు, డ్రెస్‌కోడ్ తదితర అంశాలను వివరించారు. అనంతరం సర్టిఫికేట్లను అందజేశారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేని వారు ఈ నెల 27వ తేదీన నిర్వహించే లైసెన్స్ మేళాలో పాల్గొని పొందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ మేనేజర్ కమల్, స్టేట్ కో ఆర్డినేటర్ ప్రసన్న, వసీం, భారతి తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులతో ఫుడ్ సేఫ్టీ అధికారులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- అవగాహనతోనే నియత్రించడం సాధ్యం
- వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి ఎస్పీ రూపేష్


మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 22 : సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని, ప్రజలకు అవగాహన కల్పించడంతోనే నియత్రించడం సాధ్యమవుతుందని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసులను ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో గురువారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలను అరికట్టడానికి అవగాహన ఒక్కటే మార్గమన్నారు. సైబర్ బాధితులు మోసపోయిన డబ్బును బాధితులకు త్వరితగతిన అందే విధంగా చూడాలన్నారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాల ద్వారా వచ్చే అనుమానిత లింకులను ఓపెన్ చేయొద్దని ప్రజలకు సూచించారు. పోలీసులు, సీబీఐ, ఈడీ అంటూ వచ్చే ఫోన్‌కాల్స్‌కు భయపడొద్దని, ఏ పోలీసు, ఇతర సంస్థలు డబ్బు అడగవన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. సైబర్ బాధితులు కోల్పోయిన డబ్బును త్వరగా బాధితుల ఖాతాల్లో చేరేవిధంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని పోలీసులకు సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి : డీఎంహెచ్‌వో

చిన్నశంకరంపేట, ఆగస్టు 22 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి శ్రీరాం, అన్నారు. మండలంలోని శాలిపేట గ్రామంలో ఓ యువకుడు డెంగ్యూతో బాధపడుతూ మృతిచెందిగా గురువారం మలురియా జిల్లా అధికారి విజయేందర్, పలువురు వైద్యులతో కలిసి ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి పాత కుండీలు, టైర్లు, గుంతల్లో నీటిని తొలగించారు. మండల వైద్యాధికారి సాయిసింధు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీధుల్లో, మురుగు కాల్వల వద్ద హైపో క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి శ్రీరాం ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.


శాలిపేటలో హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారి చేస్తున్న సిబ్బంది

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డీఈవో

నిజాంపేట, ఆగస్టు 22 : నందిగామ గ్రామంలోని గుడ్ షెపర్డ్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను జిల్లా విద్యాధికారి రాధా కిషన్ గురువారం క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తారని, మండల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయిలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం, నోడల్ అధికారి యాదగిరి, ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానమాల, వందన, రవీందర్, ప్రవీణ్, లింగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్హేర్‌లో


కల్హేర్, ఆగస్టు 22 : కల్హేర్ మండల స్థాయి పాఠశాలల ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే ఈ క్రీడల్లో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాల, బాలికలకు తలపడనున్నారుని పేర్కొన్నారు.

ఎల్లమ్మ గుట్టకు నూతన శోభ

త్రిశూలం, ధమరుకం ఏర్పాటు తుది దశకు


తయారు చేయించిన ఓంకారంతో కూడిన త్రిశూలం

చేర్యాల, ఆగస్టు 22 : కొమురవెల్లి మల్లన్న ఆలయ ఔన్నత్యాన్ని చాటడంతో పాటు శైవక్షేత్ర ఆనవాలు ప్రతిబింబించేలా ఎల్లమ్మ గుట్టపై త్రిశూలం, ఢమరుకం ఏర్పాటు చేయాలని దేవాదాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆలయ వర్గాలు ఏర్పాటు పనులు వేగవంతం చేశారు. నెలాఖరులోగా అందుబాటులోకి రానుంది. దీంతో ఎల్లమ్మగుట్ట నూతన శోభను సంతరించుకోబోతుంది. మల్లన్నను దర్శించుకునే భక్తులు తన సహోదరి అయిన ఎల్లమ్మను దర్శించుకుని బోనం నివేదించడం ఇక్కడ ఆనవాయితీ. గుట్టపై సూక్మానుగుండు, చుక్కల పర్వతం ఉన్నాయి. చుట్టూ పచ్చని పొలాలు, చెరువు, గుట్టలతో కనువిందు చేస్తుండటంతో ఇక్కడి ఆహ్లాదాన్ని భక్తులు ఆస్వాదిస్తుంటారు. ఎల్లమ్మ గుట్టపై త్రిశూలం-ఢమరుకం ఏర్పాటు చేయాలని సంకల్పించి రూ.69లక్షలు నిధులు కేటాయించారు. గతేడాది సెప్టెంబరులో శంకుస్థాపన చేయగా పనులు తుదిదశకు చేరుకున్నాయి. హైదరాబాద్‌లోని ఓ కార్ఖానాలో స్టీల్‌తో త్రిశూలం, ఢమరుకం తయారీ పనులు ఇటీవలే పూర్తిచేయించారు. వారం రోజుల్లోగా హైదరాబాద్ నుంచి వాటిని తీసుకువచ్చి ఈదురుగాలులు, వర్షానికి తట్టుకునేలా బిగింపచేసేందుకు చర్యలు చేపట్టారు. రాజీవ్ రహదారికి అతి సమీపంలో మల్లన్న ఆలయం ఉండటంతో సుదూరం నుంచే రాజగోపురం, గుట్ట కనిపిస్తుంటుంది. ప్రస్తుతం త్రిశూలం, ఢమరుకం కూడా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.


ఎల్లమ్మ గుట్ట


గుట్టపై త్రిశూలం ఏర్పాటుకు నిర్మించిన భవనం, సిద్ధం చేసిన గద్దె


జహీరాబాద్‌లో నిర్వహించిన ఆందోళనలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు


సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే చింతా, నాయకులు


ఖేడ్‌లో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


జోగిపేటలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల ఉసురు తగులుతది

- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు
- పలు మండలాల్లో బీఆర్‌ఎస్ ఆందోళనలు

జహీరాబాద్, ఆగస్టు 22: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్ర రైతుల ఉసురు తగులుతుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. రుణమాఫీ అమలులో కాంగ్రెస్ వైఫల్యం చెందిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధిష్ఠానం పిలుపుమేరకు గురువారం జహీరాబాద్ పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ నరోత్తం తదితరులు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటివరకు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మశ్చేందర్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింహులు, వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

●**సంగారెడ్డి టౌన్:** అడ్డగోలు ఆంక్షలు, అర్థం లేని షరతులతో రైతులను కాంగ్రెస్ మోసం చేస్తుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, బీఆర్‌ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, పట్నం మాణిక్యం, హకీం, మందుల వరలక్ష్మి పాల్గొన్నారు.

●**నారాయణఖేడ్:** రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని స్థానిక మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు నర్సింహారెడ్డి, కోట లలితాఆంజనేయులు, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు అలీ, మాజీ ఎంపీపీలు జంగం శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగంనజీబ్, పార్టీ మండలాధ్యక్షుడు పరమేశ్వర్, పట్టణ అధ్యక్షుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

●**జోగిపేట:** రుణమాఫీ విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించి మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. గురువారం జోగిపేటలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన చేపట్టారు. అనంతరం వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, వరం అధ్యక్షుడు వీరారెడ్డి, ఎంపీపీ మాజీ అధ్యక్షుడు హెచ్.రామాగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వీరన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●**గుమ్మడిదల:** గుమ్మడిదల మండలంలో బీఆర్‌ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గస్థాయి నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. ముందుగా గుమ్మడిదల గ్రామంలోని కానుకుంట చౌరస్తాలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రైతు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం మెదక్-హైదరాబాద్ రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. దాదాపు అరగంట సేపు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. సీఐ సుధీర్‌కుమార్ కలుగజేసుకుని ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు కొలన్ బాల్‌రెడ్డి, చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, ఆదర్శరెడ్డి, మెట్టు కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గుమ్మడిదల మండల కేంద్రంలో రైతులతో కలిసి ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

●**హత్నూర:** మండల కేంద్రమైన హత్నూరలో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌రావు, రవి, వీరేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో

నర్సాపూర్, ఆగస్టు 22: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి విమర్శించారు. గురువారం నర్సాపూర్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, సీనియర్ నాయకులు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**మెదక్ మున్సిపాలిటీ:** రైతులకు రుణమాఫీ చేసే విషయంలో చీటింగ్ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఫైటింగ్ చేస్తామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, శశిధర్‌రెడ్డి, ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్, మామిళ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మెదక్ మున్సిపాలిటీ: ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

●**పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేటలో బీఆర్‌ఎస్ నాయకులు పేట ప్రధాన రహదారిపై ర్యాలీనిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, నాయకులు పాల్గొన్నారు.

●**టేక్మాల్:** టేక్మాల్ మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెదక్-బొడ్మాట్‌పల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

●**వెల్దుర్తి:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని అంబేడ్కర్ చౌరస్తా బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాయకులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మెదక్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

●**చిలప్‌చెడ్:** చిలప్‌చెడ్ మండల కేంద్రంలోని నర్సాపూర్-జోగిపేట ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు బైఠాయించారు. దాదాపు గంటసేపు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

- సంగారెడ్డిలో బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్



సంగారెడ్డిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ బ్యాంకుల ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22: కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ సంగారెడ్డిలో గురువారం సంగారెడ్డి టౌన్ బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఐబీ నుంచి చౌరస్తా వరకు ఉద్యోగులు కొవ్వొత్తులు పట్టుకొని నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణకు కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పవన్, కార్యదర్శి వెంకటేశ్, ఉమెన్ కౌన్సిల్ నాయకులు తేజస్వీ, అమూల్య, కవిత, నాయకులు హరీశ్, మహేశ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ కోచ్‌కు డీవైఎస్‌వోగా పదోన్నతి


శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న జావిద్‌అలీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22: సంగారెడ్డిలోని యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్ కోచ్ వి.శ్రీనివాస్‌గౌడ్ కరీంనగర్ డీవైఎస్‌వోగా పదోన్నతి పొందారు. ఈ మేరకు శాట్స్ ఎండీ ఉత్తర్వులు వెలువరించారు. నాలుగున్నరేళ్లుగా స్విమ్మింగ్ పూల్ కోచ్ పని చేస్తున్న ఆయన కరీంనగర్‌కు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారిగా బదిలీ అయ్యారు. పదోన్నతిపై బదిలీ అయిన శ్రీనివాస్‌గౌడ్‌ను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్, కౌన్సిలర్ సోహెల్‌ను గురువారం సన్మానించారు.

కార్పొరేట్ స్కూల్, కాలేజీలపై చర్యలు తీసుకోండి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో అధికారులకు వినతి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22: సంగారెడ్డి పట్టణం హైదరాబాద్ రోడ్డులో అనుమతి లేకుండా కొన్ని ఏళ్లుగా నడపుతున్న శ్రీచైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం డీఈవో ఆఫీస్ ఏడీ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాశ్ మాట్లాడుతూ రకరకాల పేర్లతో ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాలు, యూనిఫామ్స్ తమ ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. సదరు కళాశాలపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్, తానాజీ, రమేశ్ పాల్గొన్నారు.

కళాశాల వద్ద బస్టాప్



బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

జిన్నారం, ఆగస్టు 22: జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కళాశాల వద్ద బస్సులు ఆపాలంటూ బుధవారం విద్యార్థులు ధర్నా నిర్వహించగా.. స్పందించిన నర్సాపూర్ డిపో అధికారులు గురువారం కళాశాల వద్ద బస్సులు ఆపేందుకు బస్టాప్ బోర్డును ఏర్పాటు చేశారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ బంద్

రామాయంపేట, ఆగస్టు 22: బంగ్లాదేశ్‌లో జరుగుతున్న మారణకాండ నిరసిస్తూ బీజేపీ ఇచ్చిన రామాయంపేట బంద్ పిలుపు విజయవంతమైంది. గురువారం ఉదయం నుంచే పార్టీ శ్రేణులు, కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. అంతేగాక పట్టణంలోని వ్యాపార సంస్థలన్నింటినీ మూసి వేయించారు. ఇటీవల హిందువులపై బంగ్లాదేశ్‌లో దాడులు పెచ్చుమీరాయని పార్టీ నాయకులు తెలిపారు. అక్కడి ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని వ్యాపారవర్గాలు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసి ఉంచారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను కూడా మూసేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌గౌడ్, భాను, జనార్ధన్‌రెడ్డితో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో ఘనంగా సంకష్టహర చతుర్థి వేడుకలు

నారాయణఖేడ్, ఆగస్టు 22: నారాయణఖేడ్‌లో గురువారం సంకష్ట హర చవితిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖేడ్ పట్టణ శివార్లలోని శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయ ఆవరణలో ఉన్నబుద్ధి, సిద్ధి, వినాయకుడికి ఆలయ వ్యవస్థాపకుడు మధు పంతులు ఆధ్వర్యంలో అభిషేకం, అలంకరణ, గణపతి హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణానికి చెందిన భక్తులు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

'ఆక్సిజన్ పార్కుకు శివ్‌రావు షెట్కార్‌పేరు పెట్టాలి'

నారాయణఖేడ్, ఆగస్టు 22: ఖేడ్ ఆక్సిజన్ పార్కుకు శివ్‌రావు షెట్కార్ ఆక్సిజన్ పార్కుగా పేరు పెట్టాలని ఏఐఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మోహిద్‌పటేల్ కోరారు. గురువారం పార్టీ నాయకులు మజహర్, అంజద్, జబ్బార్, చాంద్‌పాష, మోయిన్‌తో కలిసి ఆర్డీవో అశోకచక్రవర్తికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. శివ్‌రావుషెట్కార్ స్వాతంత్ర్య సమరయోధులుగా, మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, న్యాయవాదిగా ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన జీవిత చరిత్రను నేటియువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల పార్కుకు ఆయన పేరు పెట్టాలన్నారు.

'అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు'

అల్లాదుర్గం, ఆగస్టు 22: అర్హులందరికీ పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, బలరాం, బాలకిషన్, కొంక శ్రీశైలంలు అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన 49 మంది లబ్ధిదారులకు చెందిన రూ.16 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, చంద్రశేఖర్, అంజాగౌడ్, తుక్కారాం, నర్సింహులు, బాలరాజ్, సాయిబాబ పాల్గొన్నారు.

మాసాయిపేటలో జాతీయ అంతరిక్ష దినోత్సవం

మాసాయిపేట, ఆగస్టు 22: మాసాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంతరిక్ష దినోత్సవ ప్రాధాన్యతను, అంతరిక్షంలో భారతదేశం సాధించిన విజయాలను ఉపాధ్యాయులు పలు ఉదాహరణలతో విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ధర్మరాజు, పొదలు రంగారెడ్డి శర్మ, రాజేశ్వరరావు, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించేలా కృషి చేయాలి: విఠల్

చిలప్‌చెడ్, ఆగస్టు 22: పదో తరగతి వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ వచ్చేలా ఇప్పటి నుంచే కృషి చేయాలని మండల నోడల్ అధికారి విఠల్ సూచించారు. గురువారం మండల పరిధిలోని చిట్కుల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా 6వ, 9వ తరగతి విద్యార్థులకు న్యాస్ టెస్ట్‌పై అవగాహన కల్పించారు. 10వ తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించాలని, దానికోసం ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లపల్లి బేలూర్‌లో ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

మునిపల్లి, ఆగస్టు 22: మండల పరిధిలోని కల్లపల్లి బేలూర్ గ్రామంలో గురువారం రేణుకాఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు శివుడు, పోచమ్మ, నాంచారమ్మ, నాగబంధం, నందీశ్వరుడు ధ్వజస్తంభం తదితర దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, భక్తులు పాల్గొని ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైతర సాయికుమార్, శివచంద్రకుమార్ పాటిల్, పరశురాం గౌడ్, విఠల్‌రెడ్డి, శంకర్, తాటిపల్లి మల్లేశం, గ్రామస్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి కన్నుమూత


ఐరేని రవీందర్ గౌడ్ (ఫైల్)

రామాయంపేట, ఆగస్టు 22: ఛాతి వ్యాధితో బాధపడుతూ టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐరేని రవీందర్ గౌడ్(60) గురువారం మృతిచెందాడు. ఆయన వారంరోజులుగా అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మృతిచెందాడు. గురువారం రాత్రి స్వగ్రామమైన రామాయంపేటకు మృతదేహాన్ని తీసుకొచ్చారు. రవీందర్ గౌడ్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

సమాచారం

దరఖాస్తుల స్వీకరణ

పెద్దశంకరంపేట: రుణమాఫీ కాని రైతుల నుంచి పెద్దశంకరంపేటలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం వ్యవసాయ అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. రుణమాఫీ కాని రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాస్‌పుస్తకం, బ్యాంకు ఖాతా పాస్ బుక్, దరఖాస్తు ఫారం నింపి అన్ని జిరాక్స్‌లనుసన జతచేసి వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వినీత, తదితరులు పాల్గొన్నారు.

రేపు 3కే రన్

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలోని సహారా ఇన్‌క్లూజివ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 24న 3కే రన్ నిర్వహించనున్నట్లు సహారా సంస్థ ఎండీ మఠం శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, నివారణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ రన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్

నారాయణఖేడ్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఈ విషయమై ఖేడ్‌లో డివిజన్ నాయకులతో కలిసి ఆర్డీవో అశోకచక్రవర్తికి వినతిపత్రాన్ని అందజేశారు.

సువర్ణషెట్కార్‌కు పరామర్శ

నారాయణఖేడ్: ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తాజామాజీ చైర్‌పర్సన్ సువర్ణషెట్కార్ అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్సపొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న జీఎం ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ గుర్రపు మశ్చేందర్ ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు.

ఏఈవోలకు సన్మానం

నాగల్‌గిద్ద: మండల పరిధిలోని మోర్గి, నాగల్‌గిద్ద, క్లస్టర్లలో వ్యవసాయశాఖలో ఏఈవోలుగా విధులు నిర్వహించిన మహిపాల్, నగేష్‌లు బదిలీపై వెళ్తున్నందున గురువారం మోర్గి రైతువేదికలో రైతులు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

మున్సిపల్ కార్యాలయంలో నేడు వైద్య శిబిరం

తూప్రాన్: తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహియోద్దీన్ తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుట్టు మిషన్ల అందజేత

మనోహరాబాద్: మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి, జీడిపల్లి, మనోహరాబాద్ గ్రామాల్లోని నిరుపేదలకు ఐటీసీ ప్రైవేట్ పరిశ్రమ బందన్ కోన్‌ఫర్ పేరుతో ఉచితంగా అందజేస్తున్న కుట్టు మిషన్లను సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్‌ముదిరాజ్ పంపిణీ చేశారు.

చిట్కోజిపల్లి రైతులకు న్యాయం చేయాలి: సీపీఎం



చిట్కోజిపల్లి నుంచి తూప్రాన్ ఆర్డీవో కార్యాలయానికి రైతులతో కలిసి పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

చేగుంట, ఆగస్టు 22: చిట్కోజిపల్లి గ్రామంలోని 266/1 సర్వే నంబర్‌లో గల భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని.. సాగులో ఉన్న పేద రైతులకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి ఎం.మల్లేశం కోరారు. గురువారం చిట్కోజిపల్లి గ్రామం నుంచి తూప్రాన్ ఆర్డీవో కార్యాలయానికి రైతులు చేపట్టిన పాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని 266/1 సర్వే నంబరు భూమిలో 755 ఎకాల భూమి ఉన్నదన్నారు. 1954-1955 కస్రా పహాణి ప్రకారం ప్రభుత్వ భూమిగా రికార్డులో నమోదు చేశారని, కానీ కొంతమంది అధికారులు డబ్బులకు ఆశపడి ఇబ్రహీంపూర్‌కు దొర గోల్కొండ వెంకటకిషన్‌రావు దేశ్‌ముఖ్ పేరు మీద రికార్డులో ఎక్కించారని ఆయన పేర్కొన్నారు. ఈ భూమిలో పేదలకు పట్టాలు ఇచ్చేవిధంగా చూడాలని ఆర్డీవోను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొప్పని పద్మ, వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, జిల్లా అధ్యక్షుడు దేవయ్య, భూపోరాట కమిటీ కన్వీనర్ కోటగిరి మలేశం, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు పని కల్పించేందుకే 'ఉపాధిహామీ'

- అదనపు డీఆర్డీవో బాలరాజు



కంగ్టిలో నిర్వహించిన ఉపాధిహామీ ప్రజావేదికలో మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో బాలరాజు

కంగ్టి, ఆగస్టు 22: నిరుపేదలు, నైపుణ్యం లేని కూలీలకు పనులు కల్పించాలనే ఉద్దేశంతోనే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని అదనపు డీఆర్డీవో బాలరాజు అన్నారు. గురువారం కంగ్టిలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలు చేపట్టారు. పనులు కొనసాగిన తీరును ప్రజావేదికలో కూలీల సమక్షంలో తనిఖీ బృందాల సభ్యులు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, క్వాలిటీ కంట్రోల్ అధికారి సుభాష్, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో సుభాష్, ఏపీవో నర్సింహులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రిజర్వేషన్ అమలు ప్రక్రియకు చర్యలు చేపట్టాలి

- మాజీమంత్రి డా. చంద్రశేఖర్


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాజీమంత్రి డా.చంద్రశేఖర్

జహీరాబాద్, ఆగస్టు 22: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి పలు అంశాలతో కూడిన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో అతి పెద్దకులమైన మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. జనాభా పెరిగిన దృష్ట్యా అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలుచేయాలని కోరానని తెలిపారు. మాదిగల అభ్యున్నతికి, అభివృద్ధికి తోడ్పాటు అందించాలని, సమన్యాయం చేయాలని సీఎంకు విన్నవించానని ఆయన స్పష్టం చేశారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని మాజీ మంత్రి తెలిపారు.

ఆరోగ్యమిత్రల సమ్మె సర్కారుకు పట్టదా?

- నేడు ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారుల వద్దకు మిత్రలు
- మూడోరోజూ నల్లబ్యాడ్జీలతో విధులకు..



ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఆరోగ్య మిత్ర

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22: ఆరోగ్యమిత్రల సమ్మె సర్కారుకు పట్టదా? 16 ఏళ్లుగా పనిచేస్తున్న తమ న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదా అంటూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలు ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 20వ తేదీ నుంచి ఆరోగ్యమిత్రలు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మూడోరోజూ కూడా మిత్రలు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్యమిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు హిమగిరి ప్రసాద్ మాట్లాడుతూ మూడురోజులుగా సమ్మెచేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఆరోగ్యశ్రీ ట్రస్టు ఉన్నతాధికాలను కలిసి గోడును వెళ్లబోసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలిచి ఉద్యోగ భద్రత, వేతనాలు పెంపు సమస్యలు పరిష్కరించాలని లేకపోతే విధులను పూర్తిగా బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

ట్రిబుల్ ఆర్ కోసం 80 ఎకరాలు సేకరించనున్నాం

- ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 22: ట్రిబుల్ ఆర్ రోడ్డు కోసం అటవీ శాఖకు చెందిన 80 ఎకరాలను నర్సాపూర్ డివిజన్‌లో సేకరించనున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో అటవీశాఖ రేంజి అధికారి అరవింద్, సెక్షన్ అధికారి సాయిరాంలతో సమావేశం నిర్వహించి ట్రిబుల్ ఆర్ కోసం సేకరించనున్న అటవీ భూమికి సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ రేంజి పరిధిలోని రుస్తుంపేట బ్లాక్ పరిధిలో 30 ఎకరాలు, చిన్నచింతకుంట పరిధిలో 25 ఎకరాలు, తుజాల్‌పూర్ పరిధిలో 25 ఎకరాల చొప్పున ట్రిబుల్ ఆర్ కోసం తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ప్రొఫెసర్స్

కొండాపూర్, ఆగస్టు 22: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న సేవలపై వివిధ రాష్ట్రాల లెర్నింగ్ ప్రొఫెసర్లు ఆరాతీశారు. గురువారం చెరగోపులారంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, నిర్వహణ తీరును అంగన్‌వాడీ టీచర్ అనసూయను అడిగి తెలుసుకున్నారు. పూర్వ ప్రాథమిక విద్య వివిధ అభ్యసన మూలాల ద్వారా అభివృద్ధికి తగిన అవకాశాలు అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ప్రవర్తన, కేంద్ర పరిసరాలు ఆహ్లాదకరంగా ఉన్నాయని బృందం కితాబు ఇచ్చింది.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వెల్దుర్తి, ఆగస్టు 22: మండల కేంద్రమైన వెల్దుర్తికి చెందిన కర్రె ఈశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి గురువారం ఈశ్వరమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే ఇటీవల మృతిచెందిన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి గ్రామానికి చెందిన బండ దుర్గమ్మ, కుకునూర్ గ్రామానికి చెందిన బొప్పిడి నరసింహారెడ్డిల కుటుంబసభ్యులను నాయకులతో కలిసి రాజిరెడ్డి పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు మల్లేశం, నర్సింహారెడ్డి, మల్లేశం, అన్వేష, సుధాకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు మనుగడ


మంబోజిపల్లిలో మొక్కలు నాటుతున్న డీఆర్డీవో

మెదక్ కల్చరల్/నర్సాపూర్/కొండాపూర్/వెల్దుర్తి/మాసాయిపేట/నిజాంపేట/మనోహరాబాద్/చిన్నశంకరంపేట, ఆగస్టు 22: పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే భావితరాలకు మనుగడ ఉంటుందని మెదక్ డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. 'నాటుదాం ఒకచెట్టు-అమ్మ పేరు' మీద కార్యక్రమంలో భాగంగా గురువారం మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నగేష్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, ఏపీవో వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతీ గ్రామంలో పచ్చదనం పట్ల ప్రత్యేక దృష్టిసారించాలని డీఆర్డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ మండలం మూసాపేట గ్రామంలో 'ఒకచెట్టు-అమ్మపేరిట' అనే కార్యక్రమంలో భాగంగా స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాధవీలత, ఏపీవో అంజిరెడ్డి, ఈసీ ముజీబ్, కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు. కొండాపూర్ మండలం మేల్లపల్లిలో ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నవాణి గురువారం మొక్కలు నాటారు. వెల్దుర్తి మండలంలోని శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో కలిసి ఏపీవో రాజు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. మాసాయిపేట మండల కేంద్రంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, గ్రామ కార్యదర్శి డీ.రాణమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. నిజాంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఎంపీడీవో రాజిరెడ్డి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. మనోహరాబాద్ మండలం గౌతోజీగూడ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి స్రవంతి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురివి నాయుడు, ఖైరాడ సంస్థ ఏపీవో రాజు, మాజీ ఉపసర్పంచ్ రేణుకూమార్, విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీడీవో దామోదర్ డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి మొక్కలు నాటారు.